రేపు మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశం

రాయదుర్గం: మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 26వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్స్ -టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు కోరారు. ఇంటర్ విద్యలో జరుగుతున్న సంస్కరణలు, తల్లిదండ్రుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులను ఆదేశించారు. బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్, ఇతర అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నిధుల విషయంపై సీఎంతో మాట్లాడుతానని పనులు సకాలంలో పూర్తి చేసేలా చూడాలన్నారు. అదే విధంగా పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా అవసరమైన చోట రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు వెంకటరమణ, మెప్రా తదితరులు పాల్గొన్నారు.

స్వరార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవ్-2025లో భాగంగా బుధవారం ప్రముఖ సినీ నేపథ్య గాయని గాయత్రి నారాయణన్ స్వరార్చన చేశారు. ఇందులో శ్రీమన్నారాయణ, జయలక్ష్మి, గోవిందాశ్రిత, అందరికి అభయమ్ము, బ్రహ్మకడిగిన , తిరుమలగిరి రాయ, జో అచ్యుతానంద కీర్తనలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. కీబోర్డు రాజు, తబలా అజయ్ వాయిద్య సహకారాన్ని అందించారు. ప్రముఖ సినీదర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్, ప్రోగ్రాం నిర్మాత అజయ్‌శాంతి తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు కేంద్రంగా రాష్ట్రస్థాయి క్రీడలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అక్టోబర్ 16, 17, 18 తేదీలలో వాలీబాల్, కబడ్డీ క్రీడలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రాష్ట్ర స్థాయి క్రీడలకు మరోమారు పటాన్‌చెరు కేంద్రంగా నిలవబోతోంది. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడలను పటాన్‌చెరు కేంద్రంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్- 17 బాలుర వాలీబాల్, అండర్- 14 బాలురు, బాలికల కబడ్డీ పోటీలను అక్టోబర్ 16, 17, 18 తేదీలలో పటాన్‌చెరు మైత్రి మైదానంలో నిర్వహించబోతున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 420 మంది క్రీడాకారులతో పాటు వందమంది వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది క్రీడలలో పాల్గొనబోతున్నారని తెలిపారు. వీరందరికి మూడు రోజుల పాటు భోజనం, వసతి, బహుమతులు సొంత నిధులతో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. విజేతలను జాతీయస్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కో ఆర్డినేషన్ సమావేశం

మూసాపేట: కూకట్‌పల్లిలోని ఎస్‌కెఎస్‌ఆర్ గార్డెన్స్‌లో బుధవారం ట్రాఫిక్ మేడ్చల్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. మేడ్చల్ జోన్ పరిధిలోని మేడ్చల్, అల్వాల్, జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, ఆర్‌సి పురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం , ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు. వారికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ వీడియోలు చూపించి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. 8 కళాశాలల యాజమాన్యం ట్రాఫిక్ మార్షల్స్ చేయటానికి ముందుకు వచ్చారు. కార్యక్రమానికి ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.



హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ పార్కులో చెత్తా చెదారం, గడ్డి...



మద్యం సీసాలు...



వాకింగ్‌ట్రాక్ దుస్థితి...

పార్కు ఇలా.. సేద తీరేదెలా..

పేరుకుపోయిన చెత్తాచెదారం
- మందుబాబులకు అడ్డా.. ఎక్కడ చూసినా ఖాళీ సీసాలే
- పాడైన బెంచీలు.. మరుగుదొడ్లు అధ్వానం





పార్కులో వ్యర్థాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధి.. హుడా ట్రేడ్ సెంటర్‌లో జీహెచ్‌ఎంసీ పార్కు అధ్వానంగా తయారైంది. పార్కులో ఎక్కడ పడితే అక్కడ చెత్త, మందుబాటిళ్లు దర్శనమిస్తున్నాయి. పార్కులో గడ్డి పెరిగిపోయింది. అడవిని తలపిస్తుండడంతో స్థానికులు అటువైపు చూడడం లేదు.

- హుడాట్రేడ్ సెంటర్ కాలనీ నల్లగండ్ల కూరగాయల మార్కెట్ సమీపంలో జీహెచ్‌ఎంసీ లక్షలాది రూపాయలతో పార్కును అభివృద్ధి చేసింది.
- పార్కు నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వానంగా మారింది. సాయంత్రం కాసేపు సేద తీరే అవకాశం లేదని అపార్టుమెంట్ వాసులు వాపోతున్నారు.
- పార్కులో బెంచీలు విరిగిపోగా.. వాకింగ్ ట్రాక్‌లో గడ్డి పెరిగిపోవడంతో వాకర్స్ ఇబ్బందిపడుతున్నారు.
- టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండడంతో దుర్వాసన వస్తోంది.
- పార్కులో ఆహ్లాదపూరిత వాతావరణం నెలకొల్పాలని స్థానికులు కోరుతున్నారు. పచ్చదనం పెంపొందించడంతో బాటు లైటింగ్, సీసీ కెమెరాలు, ఓపెన్ జిమ్, చిన్నారులకు క్రీడా పరికరాలు అందుబాటులోకి తేవాలని కాలనీవాసులు కోరుతున్నారు.





అపరిశుభ్రంగా టాయిలెట్లు

నష్టపరిహారం ఇప్పించాలి.. రైతుల వినతి



రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నల్లగండ్ల రైతులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్ల పెద్ద చెరువులో పట్టా భూములు ముంపునకు గురికావడంతో తీవ్రంగా నష్టపోతున్నామని, నష్టపరిహారం ఇప్పించాలని బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డిని రైతులు కోరారు. నల్లగండ్ల పెద్ద చెరువు ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)వరకు 80 ఎకరాలు ఉండగా చెరువుకు సంబంధించిన శిఖం భూమి 18 ఎకరాల 39 గుంటలు ఉందని, మిగిలిన 60 ఎకరాల పట్టా భూమి గ్రామానికి చెందిన అన్ని కులాల వారివి ఉన్నట్లు వివరించారు. పూర్వం నుంచి వ్యవసాయం చేసుకుంటూ వస్తున్నామని విన్నవించారు. పట్టాదారుల భూమికి తగ్గట్లుగా నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. లేదా ఇతర ప్రాంతాల్లో ఇచ్చిన విధంగా టీడీఆర్ అయినా ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు.అదే విధంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్, శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మాజీ మెంబర్ బొల్లంపల్లి సత్యనారాయణరెడ్డి, నల్లగండ్ల గ్రామస్థులు బి.రాజిరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పి.మోహన్ రెడ్డి, మదర్ సేవా సమితి చైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బతుకమ్మ వేడుకలు



కొండాపూర్‌లోని సంస్కృతి డిగ్రీ కళాశాలలో..

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని సంస్కృతి డిగ్రీ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మ పేర్చి విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఆడుతూ, పాడుతూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు రేవతిరాజు, యామినిరాజు, ప్రిన్సిపల్ సురేందర్, పాల్గొన్నారు

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. అనంతరం ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మాట్లాడుతూ...బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజలను ఏకతాటి పై తీసుకొచ్చే పండుగని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు

అన్నపూర్ణేశ్వరిగా దుర్గాదేవి

గచ్చిబౌలి: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి గాయత్రీదేవి అలంకారం చేశారు. నవరాత్రుల సందర్భంగా ఆలయాల్లో అమ్మవారికి అర్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తిశ్రద్ధలతో సామూహిక పారాయణాలు, కుంకుమార్చన నిర్వహించారు. శివసాయిక్షేత్రంలో నవ చండీయాగం, చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. కాగా రాయదుర్గంలోని మండపం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారికి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రసాదాలు సమర్పించారు.



రాయదుర్గంలో మండపం వద్ద అమ్మవారికి ప్రసాదాల నివేదన



శివసాయిక్షేత్రంలో..



శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి



పోచమ్మ-ఎల్లమ్మకు కూరగాయలతో అలంకారం

నవాత్మిక నృత్యరూపకం

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగా బుధవారం సంగీత సిస్టర్స్ సంగీత కళ, రాజ్యలక్ష్మి బృందం లలితగీతాలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. కిరణ్మయి బోనాల బృందం నవాత్మిక కూచిపూడి నృత్యరూపకం ఎంతగానో అలరించింది. సంచలన, సమ్మోహన, శృతి, స్వాతి, కృతి, తరుణిగా, అనన్య, స్తుతికళ్యాణ్, హర్షిత, శరణ్య, సహస్ర, ద్రితి, తన్వి, సరయు తదితరులు నవదుర్గలుగా నర్తించారు. శిల్పారామం మహిళా సిబ్బంది, సందర్శకులు లాన్‌లో బతుకమ్మ ఆటపాటలతో సరదాగా గడిపారు. నగరవాసులు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు.





క్రెడిట్ కార్డ్ లిమిట్ పెంచుతామంటూ..

రూ.2 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

పటాన్‌చెరు టౌన్: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించిన వ్యక్తి వివరాలు చెప్పడంతో అతడి క్రెడిట్ కార్డు నుంచి రూ.2 లక్షల 19 వేలు సైబర్ నేరగాళ్లు కాజేసిన చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైమ్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్‌కు చెందిన ఓ వ్యక్తికి ఈనెల 19 వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు నుండి కాల్ చేస్తున్నామని, క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పడంతో బాధితుడు తన క్రెడిట్ కార్డు వివరాలను వారికి చెప్పాడు. దీంతో అపరిచిత వ్యక్తి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచామని.. మీకు ఓటీపీ వస్తుంది చెప్పాలని అడగడంతో అపరిచిత వ్యక్తి నిజమే అనుకొని చెప్పాడు. దీంతో వెంటనే అతడి ఖాతా నుండి రూ. రెండు లక్షల 19 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి బుధవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో.. టాస్కులు కమిషన్ పేరిట.. రూ.3 లక్షల 19 వేలు పోగొట్టుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి


టాస్కులు.. కమీషన్ పేరిట జరిగిన సైబర్ మోసంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ. 3 లక్షల 19 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైమ్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధి కృషి డిఫెన్స్ కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఈ నెల 1 వ తేదీన ఫేస్‌బుక్‌లో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. దీంతో ఆ మహిళ టాస్కులు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామని చెప్పడంతో బాధితుడు ఆమె చెప్పిన విధంగా ముందుగా రూ. 5 వేలు ఇన్వెస్ట్ చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతో పాటు కమీషన్ వస్తుందని చెప్పి నమ్మించడంతో వ్యాపారి పలు దఫాలుగా రూ.3 లక్షల 19 వేలు వేశాడు. పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

మియాపూర్ : ఇంటినుండి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్‌లోని న్యూ హఫీజ్‌పేటలోని మార్తాండనగర్ కాలనీలో లింగన్నొళ్ల సుజాత(40) రాంచంద్రారెడ్డి దంపతులు నివాసముంటున్నారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో సుజాత ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లింది. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకీ లభించలేదు. కాగా సుజాత మానసిక స్థితి సరిగా లేదని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఊపిరితిత్తుల సంరక్షణ చాలా అవసరం

- రోజురోజుకు లంగ్ కేన్సర్ కేసులు పెరుగుతున్నాయి
- భారత్‌లో ఆస్తమా శాతం 1.18 : పల్మనాలజిస్ట్ డా. శ్రీకాంత్
- నేడు ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవం



రాయదుర్గం: భారతదేశంలో గాలి కాలుష్యం, ధూమపానం, ఇంటిలోపల కట్టెలు/బయోమాస్ వాడకం వల్ల లక్షలాది మంది ఊపిరితిత్తుల సమస్యలకు గురవుతున్నారని స్టార్ ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్, క్లినికల్ అండ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ పెద్ది శ్రీకాంత్ తెలిపారు. గురువారం ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన 'సాక్షి'తో మాట్లాడారు ..జనాభాలో సుమారు 1.18 శాతం మందికి ఆస్తమా ఉందని, అనేక కేసులు గుర్తించబడకపోవడం ఆందోళనకరమన్నారు. 2015లో భారత్‌లో 70వేల మందికి పైగా లంగ్ కేన్సర్ కొత్త కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవాలన్నారు. అవగాహన, నివారణ కీలకంగా మారిందన్నారు.

ప్రశ్న: ఊపిరితిత్తుల వ్యాధుల గురించి వివరించండి

జ: ఊపిరితిత్తుల వ్యాధులు అనేక రకాలున్నాయి. వాటిలో..

- ఎయిర్‌వే వ్యాధులు.. గాలి వెళ్ళే మార్గాలను ప్రభావితం చేస్తాయి.(ఆస్తమా, సీఓపీడీ, బ్రాంకైటిస్, బ్రాంకి ఎక్టాసిస్), రోగులకు ఇది స్ట్రా ద్వారా శ్వాసిస్తున్నట్లు అనిపిస్తుంది.
- లంగ్ టిష్యూ వ్యాధులు.. ఊపిరితిత్తుల కణజాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తాయి. బాగా బిగించి వేసిన జాకెట్ ధరించినట్లు అనిపిస్తుంది.
- లంగ్ సర్క్యులేషన్ వ్యాధులు.. ఊపిరితిత్తుల రక్తనాళాలను ప్రభావితం చేస్తాయి. రోగులు తక్కువ శ్రమకే తీవ్ర శ్వాస సమస్య అనుభవిస్తారు.
- సాధారణ సమస్యలు.. ఆస్తమా, క్రానిక్‌బ్రాంకైటిస్, సీఓపీడీ, న్యూమోనియా వంటి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, లంగ్ క్యాన్సర్, పల్మనరీ ఎడిమా (ఊపిరితిత్తులలో నీరు చేరడం), పల్మనరీ ఎబాలిజం(ఊపిరితిత్తు ధమనిలో ఆటంకం), ఊపిరితిత్తి కుచించుకుపోవడం.

ప్ర : ముందస్తు లక్షణాలను గుర్తించడం ఎలా.. ?

జ: ఎప్పుడూ నిర్లక్ష్యం చేయరాని సంకేతాలుగా నిరంతరం దగ్గు, తేలికపాటి పనికే శ్వాస ఇబ్బంది, ఛాతీలో నొప్పి లేదా బిగుతు, తరచూ ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, అర్థం కాని అలసట లేదా బరువు తగ్గడం, ఈ లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించడం చాలా ముఖ్యం.

ప్ర: ఊపిరితిత్తుల ఆరోగ్యం కోసం పాటించాల్సినవి..

జ: ఊపిరితిత్తుల సంరక్షణ ఆరోగ్యకరమైన జీవనానికి మార్గం. పొగ తాగడం నిలిపివేయాలి. పాసివ్ స్మోకింగ్‌కి దూరంగా ఉండాలి. గాలి కాలుష్యం ఎక్కువగా ఉన్నప్పుడు బయటికి వెళ్ళేటప్పుడు మాస్క్ వాడాలి. ఇంట్లో శుభ్రమైన ఇంధనం వాడాలి, గాలి ఆడేలా వంటగది ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అవసరమైన టీకాలు వేయించుకోవాలి.తగు జాగ్రత్తలు తీసుకుంటే ఊపిరితిత్తుల ఆరోగ్యం కాపాడుకోవచ్చు.

ప్ర: ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవం నిర్వహించడంపై..?

జ: ప్రపంచవ్యాప్తంగా ఊపిరితిత్తుల వ్యాధులతో మరణాలు.. అనారోగ్యంలో ఒకటిగా మారింది. ఈ దినోత్సవం ద్వారా సాధారణ ఊపిరితిత్తుల సమస్యలు(సీఓపీడి) ఆస్తమా, లంగ్ క్యాన్సర్‌పై అవగాహన పెంచడం, ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించడం కోసమే నిర్వహిస్తున్నారు.

సమాచారం

గచ్చిబౌలి: సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే కింది నంబర్లను సంప్రదించవచ్చు..

- డీఈ గచ్చిబౌలి : 87124 69627
- ఏడీఈ చందానగర్ : 87124 69629
- ఏఈ చందానగర్ : 87124 69634
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ (చందానగర్) : 87124 69655
- ఏఈ గచ్చిబౌలి : 87124 69631
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ (గచ్చిబౌలి) : 87124 69652
- ఏఈ నల్లగండ్ల : 87124 69633
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ (నల్లగండ్ల) : 87124 69654
- ఏఈ తారానగర్ : 87124 69632
- ఫూజ్ ఆఫ్ కాల్ (తారానగర్) : 87124 69653
- ఏఈ హాఫీజ్‌పేట్ : 87124 69636
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ (హఫీజ్‌పేట్) : 87124 69657
- ఏఈ వసంతనగర్ : 87124 69635
- ఫ్యూజ్ ఆఫ్ కాల్ (వసంతనగర్): 87124 69656

ఐటీఐ అడ్మిషన్లకు 30న కౌన్సెలింగ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల అడ్మిషన్ల కౌన్సెలింగ్‌ను ఈనెల 30వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ బుధవారం తెలిపారు. క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో ఉదయం 9.30 గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. పాల్గొనే వారు తమ దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీని ఈనెల 29గా నిర్ణయించినట్లు తెలిపారు.దరఖాస్తు ఫారాలు, ఇతర వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐటీఐ కార్యాలయాన్ని స్వయంగా కానీ లేదా ఫోన్ ద్వారా 040-23008428, 9440692452 సంప్రదించాలని ఆమె సూచించారు.

ఉచిత ఆరోగ్య కేంద్రం

చందానగర్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ల లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పని చేస్తుంది. అవుట్ పేషంట్‌కు రూ.30లు చెల్లించాలి. రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు చేస్తారు .ఉచితంగా మందులు, మైనర్ ఆపరేషన్లు కూడా ఆరోగ్యం కేంద్రంలో నిర్వహిస్తారు. ఆదివారం ఆరోగ్య కేంద్రానికి సెలవు.

ప్రమాదకరంగా మూలమలుపు



జిన్నారం (పటాన్‌చెరు): మూలమలుపు వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుమ్మడిదల పట్టణ పరిధిలోని అన్నారం గ్రామ శివారు వద్ద సూచిక బోర్డు లేకపోవడంతో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక ,సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.